వంటగ్యాస్‌పై రూ.50 వడ్డన

- ఉజ్వల స్కీమ్ లబ్ధిదారులకూ దక్కని మినహాయింపు
- సామాన్యుడిపై కేంద్రం పిడుగు.. సీఎన్‌జీపైనా రూ.1 పెంపు
- పదకొండేండ్లలో 130.57 శాతం పెరిగిన వంటగ్యాస్ ధర

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో ఇప్పటికే కుదేలైన పేద, మధ్యతరగతి ప్రజలపై కేంద్రంలోని మోదీ సర్కారు మరో పిడుగు వేసింది. గృహావసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరను ఏకంగా రూ. 50 పెంచింది. ఈ మేరకు సోమవారం కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి వెల్లడించారు. నాన్ సబ్సిడీ వినియోగదారులతో పాటు సబ్సిడీ గ్యాస్ అందుకొంటున్న ఉజ్వల పథకం లబ్ధిదారులకు కూడా ఈ పెంపు వర్తిస్తుందని మంత్రి తెలిపారు. తాజా పెంపుతో తెలుగు రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధర రూ. 920 వరకూ చేరినట్టు పలువురు వినియోగదారులు మండిపడుతున్నారు.

సీఎన్‌జీపై రూ.1 పెంపు

కిలో సీఎన్‌జీపై రూ. 1 పెంచుతున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గతవారం ఇన్‌పుట్ సహజ వాయువు ధరలను ప్రభుత్వం దాదాపు 4 శాతం పెంచిన నేపథ్యంలో తాజాగా సీఎన్‌జీ ధరలను కిలోకు రూ.1 చొప్పున పెంచింది. ఇది దేశ రాజధాని తోపాటు ఇతర నగరాలకు వర్తిస్తుంది. ఢిల్లీలో కిలో సిఎన్‌జీ ధర రూ. 75.09కి చేరుకుందని నగరానికి చెందిన గ్యాస్ రిటైలర్ ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ ఎక్స్ వేదికగా తెలిపింది.

పదకొండేండ్లూ భారమే

2014లో మోదీ ప్రధానిగా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి వంటగ్యాస్ సిలిండర్ ధరలు భారీగా పెరిగాయి. 2014లో రూ. 399గా ఉన్న వంట గ్యాస్ సిలిండర్ ధర.. తాజా పెంపుతో రూ. 920కు చేరింది. అంటే పదకొండేండ్ల వ్యవధిలో గ్యాస్ ధరలు ఏకంగా 130. 57 శాతం పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బ్యారెల్ ముడిచమురు ధర నాలుగేండ్ల కనిష్ఠానికి చేరినప్పటికీ, దేశీయంగా ఇంధన ధరలను మాత్రం కేంద్రంలోని ఎన్డీయే సర్కారు సవరించకపోగా గ్యాస్ ధరలను పెంచింది. దీంతో కేంద్ర సర్కారు వైఖరిపై సామాన్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పదకొండేండ్లలో గ్యాస్ ధర ఎంత పెరిగిందంటే?

2014	2025	పెరుగుదల (శాతాల్లో)
రూ. 399	రూ. 920	130.57

2030 నాటికి మనిషిని మించిన మేధస్సు!

- మానవాళినే నాశనం చేయనున్న ఏఐ
- 'గూగుల్ డీప్‌మైండ్' అంచనా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: ఆధునిక సాంకేతికతల్లో ఒకటైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శరవేగంగా పురోగమిస్తున్నది. భవిష్యత్తులో ఈ సాంకేతిక పరిజ్ఞానం మానవాళి మనుగడకే ప్రమాదకరంగా మారుతుందన్న భయాందోళనలు చాలా కాలం నుంచి వినిపిస్తున్నాయి. ఆ రోజులు త్వరలోనే రాబోతున్నట్టు తాజా పరిశోధనలో తేలింది. 2030 నాటికి ఏఐ మరింత అభివృద్ధి చెందుతుందని, మానవులతో సమానమైన తెలివితేటలు కలిగిన కృత్రిమ మేధస్సుగా పిలిచే ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ)గా రూపాంతరం చెంది మానవాళిని శాశ్వతంగా నాశనం చేస్తుందని 'గూగుల్ డీప్‌మైండ్' తన పరిశోధనా పత్రంలో పేర్కొంది. అయితే ఈ ముప్పు ఎలాంటిదో, మానవాళి మనుగడకు ముప్పు ఎలా వస్తుందో వెల్లడించలేదు. ఏజీఐ వల్ల ఎదురయ్యే ప్రమాదాలను ఈ అధ్యయనం 4 ప్రధాన క్యాటగిరీలుగా విభజించింది. ఏజీఐతో సమాచార దుర్వినియోగం (డాటా మిస్ యూజ్), మిస్ అలైన్‌మెంట్, మిస్టేక్స్, స్ట్రక్చరల్ రిస్క్స్ లాంటి ప్రమాదాలు ఉన్నాయని ఈ పరిశోధనా పత్రం సహ రచయిత, 'డీప్‌మైండ్' సహ వ్యవస్థాపకుడు షేన్ లెగ్ స్పష్టం చేశారు. ఈ ప్రమాదాలను తగ్గించేందుకు గూగుల్, ఇతర ఏఐ కంపెనీలు తగిన నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. కృత్రిమ మేధస్సును నియంత్రణలో ఉంచడంపైనే ఈ పరిశోధనలో దృష్టి కేంద్రీకరించామని, దాని వల్ల ఎదురయ్యే ముప్పుపై లోతుగా అధ్యయనం చేశామని చెప్పారు. కాగా, మనుషుల కంటే ఎక్కువ తెలివితేటలు కలిగిన ఏజీఐ రాబోతున్నదని, వచ్చే 5 నుంచి 10 ఏండ్లలో దీని ఆవిర్భావం ప్రారంభం కావచ్చని 'డీప్‌మైండ్' సీఈవో డెమిస్ హస్సాబిస్ రెండు నెలల క్రితమే స్పష్టం చేశారు. ఏజీఐ అభివృద్ధిని పర్యవేక్షించేందుకు ఐక్యరాజ్య సమితి లాంటి అంతర్జాతీయ సంస్థను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన ఉద్ఘాటించారు.

ఏజీఐ అంటే..

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏఐకి మరో ముందడుగే ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్. ఏఐ అనేది టాస్క్ స్పెసిఫిక్‌గా ఉంటుంది. అంటే మనం ఇచ్చిన పనులను మాత్రమే చేయగలుగుతుంది. కానీ, ఏజీఐ అనేది మానవ మేధస్సు మాదిరిగా అనేక రకాల పనుల నిర్వహణకు అవసరమైన తెలివితేటలను కలిగి ఉండేలా లక్ష్యాలను పెట్టుకుంటుంది. స్పష్టంగా చెప్పాలంటే ఇది మనుషుల మాదిరిగా విభిన్న డొమైన్లలోని జ్ఞానాన్ని అర్థం చేసుకుని, నేర్చుకోవడంతోపాటు ఆ జ్ఞానాన్ని రకరకాల పనుల కోసం అన్వయించగలిగే ఓ యంత్రం.

వేలానికి 500 భారీ మొసళ్లు

ప్రారంభ ధర రూ.4.71 కోట్లు • చైనా కోర్టు ఆదేశంతో అమ్మకానికి

బీజింగ్: రకరకాల అరుదైన, సాధారణ వస్తువులను వేలం వేయడం గురించి మనం వినే ఉంటాం. అయితే చైనాలో ఇటీవల కోర్టు ఆదేశాలతో ఏకంగా 500 సియామీ మొసళ్లను వేలానికి పెట్టడం అందరినీ ఆకర్షించింది. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం ప్రకారం.. వ్యక్తులెవరైనా మే 9 వరకు సాగే ఈ వేలంలో పాల్గొని భారీ మొసళ్లను తమ సొంతం చేసుకోవచ్చు. గాంగ్‌డాంగ్ హోంగీ సంస్థ నిర్దిష్ట ఆర్థిక లావాదేవీలను నిర్వర్తించడంలో విఫలం కావడంతో ఆ సంస్థ పెంచుతున్న మొసళ్లను వేలం వేయాలని షెన్‌జెన్ నన్‌షన్ ప్రజా కోర్టు ఆదేశించింది. మొసళ్ల ప్రారంభ ధరను నాలుగు మిలియన్ల యువాన్లుగా(రూ.4.71 కోట్లు) నిర్ణయించింది. చైనాలో మొసళ్లను పెంచి వాటిని వ్యాపార వస్తువులుగా అమ్ముకోవచ్చు. మొసళ్ల మాంసం, చర్మానికి చైనాలో బాగా డిమాండ్ ఉంది. ఇక వాటి ఎముకలు, పళ్లు, రక్తాన్ని సంప్రదాయ మందుల తయారీలో, ఇతర అవసరాలకు ఉపయోగిస్తారు.

పెట్రోల్, డీజిల్‌పై పరోక్ష బాదుడు

- ఎక్సైజ్ డ్యూటీ రూ. 2 పెంపు
- అంతర్జాతీయంగా నాలుగేండ్ల కనిష్ఠానికి చమురు ధరలు
- ఆ ప్రయోజనం సామాన్యుడికి దక్కకుండా ఎక్సైజ్ డ్యూటీ పెంపు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు భారీగా తగ్గినా ఆ ప్రయోజనాలు సామాన్యుడికి దక్కకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరో గిమ్మిక్‌కు పాల్పడింది. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని రూ. 2 చొప్పున పెంచుతున్నట్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం నుంచి ఈ పెంపు వర్తిస్తుందని వెల్లడించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగినప్పుడు పెట్రో వాత పెట్టిన ఎన్డీయే సర్కారు.. ధరలు తగ్గినప్పుడు మాత్రం పెట్రోల్, డీజిల్ రేట్లను తగ్గించట్లేదు. దీంతో సామాన్యులకు అందాల్సిన ప్రయోజనాలు అందకుండా పోతున్నాయి. వివరంగా చెప్పాలంటే.. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గితే, దేశీయంగా పెట్రో ధరలు తగ్గాలి. కానీ కేంద్రం ఎక్సైజ్ సుంకాల పేరిట సవరణలు చేస్తూ ఇంధన ధరలను తగ్గించడం లేదు. దీని కోసం ఎక్సైజ్ డ్యూటీ పేరిట అదనపు సుంకాలను విధిస్తున్నది. గడిచిన పదకొండేండ్లలో కేంద్రం పెట్రోల్‌పై 37.13 శాతం ఎక్సైజ్ డ్యూటీని పెంచగా, డీజిల్‌పై ఏకంగా 180.89 శాతం పన్ను పెంచింది. ఈ మేరకు పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ (పీపీఏసీ) గణాంకాలు చెప్తున్నాయి. ఉక్రెయిన్-రష్యా యుద్ధం ప్రారంభంలో అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా తగ్గినప్పటికీ, అదనపు సంకాలను పెంచుతూ ఆ ప్రయోజనాలను సామాన్యులకు దక్కకుండా మోదీ సర్కారు వ్యవహరించడం తెలిసిందే.

పదకొండేండ్లలో వేటి ధర ఎంత పెరిగిందంటే?

ఇంధనం	2014	2025	పెరుగుదల (శాతాల్లో)
పెట్రోల్	రూ. 71	రూ. 107.46	51.35
డీజిల్	రూ. 55	రూ. 95.70	74

పదకొండేండ్లలో ఎక్సైజ్ డ్యూటీలో మార్పు ఇలా..

ఇంధనం	2014	2025	పెరుగుదల (శాతాల్లో)
పెట్రోల్	రూ. 9.48	రూ. 13	37.13
డీజిల్	రూ. 3.56	రూ. 10	180.89

పదకొండేండ్లు మోతే

2014లో మోదీ ప్రధానిగా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగాయి. పదకొండేండ్ల వ్యవధిలో లీటర్ పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా 51.35 శాతం, 74 శాతం మేర పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బ్యారెల్ ముడి చమురు ధర నాలుగేండ్ల కనిష్ఠానికి చేరినప్పటికీ, దేశీయంగా ఇంధన ధరలను మాత్రం తగ్గించని కేంద్రంలోని ఎన్డీయే సర్కారు పెట్రోవాతకు తెగబడింది. అంతర్జాతీయ విపణిలో ప్రస్తుతం బ్యారెల్ ముడిచమురు ధర 65 డాలర్లకు దిగువకు చేరింది. అయినప్పటికీ, దేశీయంగా లీటర్ పెట్రోల్ ధర రూ. 107.46, డీజిల్ ధర రూ. 95.70గానే ఉన్నది. దీంతో కేంద్ర సర్కారు వైఖరిపై సామాన్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నా దరఖాస్తును మీరు రెండేండ్లుగా తొక్కిపెట్టారు!

గోయల్‌కు స్టార్టప్ ఫౌండర్ కౌంటర్

న్యూఢిల్లీ: చైనాలో ఔత్సాహిక పారిశ్రామికులు ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ పరిజ్ఞానం, సెమికండక్టర్లు, కృత్రిమ మేధపై పనిచేస్తుండగా, భారత్‌లో అనేక స్టార్టప్‌లు సాంకేతిక పురోగతి వైపు కృషి చేయకుండా తక్కువ ఆదాయం వచ్చే చిల్లర వ్యాపారాలతోనే సంతృప్తి చెందుతాయా అంటూ కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ చేసిన వ్యాఖ్యలపై సెమికండక్టర్ స్టార్టప్ ఫౌండర్ విజయ్ విఠల్ కౌంటర్ ఇచ్చారు. కేంద్రం నిర్వహించిన అనేక సదస్సులకు తాను హాజరయ్యానని, మీ అవసరాలకు అనుగుణంగా చిప్‌లను అభివృద్ధి చేసే సామర్థ్యం తమకు ఉందని, ఎన్ని చిప్‌లను మీరు కొనుగోలు చేస్తారని ప్రశ్నించానన్నారు. అయితే 'మీరు ముందు తయారుచేయండి.. తర్వాత చూద్దాం', 'మేం కొనుగోలు చేయం.. వీటికి మార్కెట్ ఎక్కడ ఉందో మీరే వెతుక్కోండి' అన్న సమాధానాలే వచ్చాయని ఆయన చెప్పారు. కొనుగోలుదారు, మార్కెట్‌లేని చోట ఏ స్టార్టప్ కూడా 10-20 కోట్లు, రెండేండ్ల సమయం వృథా చేయదన్నారు. అలాగే 'పన్ను మినహాయింపులకు సంబంధించి మీ శాఖ నా దరఖాస్తును రెండేండ్లుగా తొక్కిపెట్టింది' అని గోయల్‌కు ఆయన తెలిపారు. ఇండియా బయట మా పోటీ సంస్థలతో పోలిస్తే ఇక్కడి ట్యాక్స్‌ల కారణంగా దిగుమతులకు తాము రెండింతలు ఎక్కువ వ్యయం చేసినట్టు చెప్పారు.

తహవుర్ రాణా అప్పగింతకు లైన్ క్లియర్

వాషింగ్టన్ : ముంబై ఉగ్రవాద దాడుల కేసులో దోషి తహవుర్ రాణాకు అమెరికా సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. తనను భారత దేశానికి పంపించాలని జారీ అయిన ఆదేశాలను నిలిపివేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దీంతో ఇక ఆయనను భారత దేశానికి రప్పించడానికి మార్గం సుగమం అయింది.

చెప్పులు దాచినందుకు రూ.5 వేలేనా?

యూపీలో వరుడిపై వధువు కుటుంబం దాడి

బిజ్‌నోర్: పెండ్లి వేడుకలో వరుడి చెప్పులు దాచి పెట్టే కార్యక్రమం వధూవరుల కుటుంబాల మధ్య ఘర్షణకు దారి తీసిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నోర్‌లో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... పెండ్లి వేడుకల సంప్రదాయాల్లో భాగంగా వరుడు ముహమ్మద్ షబీర్ చెప్పులను వధువు సోదరి దాచి పెట్టి రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. వరుడు ఆమెకు రూ.5 వేలు ఇచ్చి తన చెప్పులు వెనక్కు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఆ తర్వాత వధువు బంధువులు కొందరు ఈ విషయమై వరుడిని పరిహాసం చేస్తూ అతడిని బిచ్చగాడని పిలిచారు. ఈ విషయమై ఇరు కుటుంబాల మధ్య వాదన జరిగింది. వధువు కుటుంబ సభ్యులు వరుడిని ఒక గదిలో బంధించి కర్రలతో కొట్టారని అతడి బంధువులు ఆరోపించారు. అయితే వరుడి కుటుంబం వారికి కానుకగా లభించిన బంగారం నాణ్యతపై సందేహాలు వ్యక్తం చేయడంతోనే గొడవ జరిగిందని వధువు వర్గం వారు ఆరోపించారు. వధువు కంటే డబ్బుకే ఎక్కువ ప్రాధాన్యమిస్తామని వరుడి కుటుంబం తమతో అన్నదని వధువు సోదరుడు ఆరోపించారు. గొడవలపై ఇరు కుటుంబాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నాయి. పోలీసుల జోక్యంతో ఇరు కుటుంబాలు రాజీకి వచ్చాయి.

నేను బతికి ఉండగా అలా జరగనివ్వను

ఉద్యోగాలు రద్దయిన టీచర్లకు మమత భరోసా

కోల్‌కతా: ఉపాధ్యాయ నియామకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తాను ఆమోదించినట్టు భావించవద్దని, ఈ మాటలను అన్నందుకు తనను జైలుకు కూడా పంపవచ్చని, అయినప్పటికీ తాను లెక్క చేయబోనని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. నగరంలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో సోమవారం సమావేశమైన టీచర్లను ఉద్దేశించి మమత ప్రసంగించారు. గత వారం 25,000 మందికిపైగా టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ తాను బతికి ఉండగా అలా జరగనివ్వనని మమత ప్రకటించారు. ఈ సందర్భంగా అఖిల భారత వైద్య ప్రవేశ పరీక్ష నీట్‌ను ఆమె ఉదహరిస్తూ ఆ కేసులో సుప్రీంకోర్టు మొత్తం పరీక్షను రద్దు చేయలేదని గుర్తు చేశారు. 'ఎవరు అర్హులో, ఎవరు అనర్హులో సుప్రీంకోర్టు తేల్చాలి. మాకు జాబితా ఇవ్వండి. విద్యా వ్యవస్థను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదు. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో వ్యాపం స్కామ్‌లో చాలా మంది మరణించారు. వారికిప్పటికీ న్యాయం లభించలేదు. నీట్‌పై అనేక ఆరోపణలు వచ్చాయి. సుప్రీంకోర్టు పరీక్షను రద్దు చేయలేదు. బెంగాల్‌నే ఎందుకు టార్గెట్ చేస్తున్నారు? బెంగాల్ ప్రతిభను చూసి మీరు భయపడుతున్నారు' అని బీజేపీ, సీపీఎంలను ఉద్దేశించి మమత వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు తమకు స్పష్టత ఇవ్వాలని, లేని పక్షంలో తామే వేరే మార్గాన్ని ఎంచుకుని ఉద్యోగాలు కోల్పోయిన టీచర్లు, సిబ్బందికి అండగా ఉంటామని ఆమె చెప్పారు.

అక్రమ వలసదారులపై సౌదీ ఉక్కుపాదం

రియాద్: వార్షిక హజ్ యాత్ర సమీపిస్తున్న తరుణంలో అక్రమ వలసదారులపై సౌదీ అరేబియా కఠిన చర్యలు తీసుకుంటున్నది. ఈ యాత్ర జూన్ 4-9 మధ్య జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భద్రత నిబంధనల ఉల్లంఘనదారులపై సౌదీ అరేబియా కొరడా ఝుళిపించింది. మార్చి 27-ఏప్రిల్ 2 మధ్య కాలంలో 18,407 మందిని అరెస్ట్ చేసింది. చట్టవిరుద్ధంగా దేశంలో ప్రవేశించేందుకు 1,260 మంది, దేశం నుంచి వెళ్లిపోయేందుకు 67 మంది ప్రయత్నించారని తెలిపింది. అక్రమంగా ప్రవేశించేవారికి సహకరించే వ్యక్తులకు భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించింది.

పెద్ద నగరాల్లో లైంగిక దాడులు సహజమే

- కర్ణాటక కాంగ్రెస్ మంత్రి పరమేశ్వర వ్యాఖ్యలు
- రాజీనామా చేయాలని ప్రతిపక్షం డిమాండ్
- మంత్రి వ్యాఖ్యలు సిగ్గుచేటని నెటిజన్ల ఫైర్

పరమేశ్వర రాజీనామాకు బీజేపీ డిమాండ్

బెంగళూరు, ఏప్రిల్ 7: బెంగళూరు లాంటి మహా నగరాల్లో మహిళలపై లైంగిక దాడులు సర్వసాధారణమేనని కర్ణాటక కాంగ్రెస్ మంత్రి పరమేశ్వర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇటీవల బెంగళూరులో ఓ యువతిపై దుండగుడు లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చట్ట ప్రకారం నిందితుడిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెట్రోలింగ్ పెంచాలని పోలీసులను ఆదేశించారు. అయితే హోం మంత్రి వ్యాఖ్యలపై ప్రతిపక్షంతో పాటు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి వ్యాఖ్యలు సిగ్గుచేటని మండిపడ్డారు. సుద్దగుంటపాళ్యలోని భారతీ లేఅవుట్‌లోని ఓ ఇరుకు సందులో ఇద్దరు మహిళలపై ఓ వ్యక్తి దాడి చేసిన ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ గత వారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఏప్రిల్ 3న తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. జన సంచారం లేని వీధిలో నడుచుకుంటూ వెళుతున్న ఇద్దరు మహిళల వద్దకు వచ్చిన దుండగుడు ఓ మహిళను గోడకు తోసి ఆమె శరీరాన్ని అసభ్యకరంగా తాకిన దృశ్యాలు ఆ వీడియోలో కనిపించాయి. ఆ తర్వాత అతను అక్కడి నుంచి పారిపోయాడు. ఈ హఠాత్పరిణామంతో ఆ ఇద్దరు మహిళలు నిశ్చేష్టులు కావడం అందులో కనిపించింది. ఈ ఘటన నగరంలో తీవ్ర సంచలనం సృష్టించింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయనప్పటికీ సుమోటోగా కేసును నమోదు చేసిన బెంగళూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బెంగళూరు లాంటి మహా నగరంలో లైంగిక దాడులు జరగడం సహజమేనంటూ వ్యాఖ్యానించిన కర్ణాటక హోం మంత్రి జీ పరమేశ్వర రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా ఆదేశించాలని బీజేపీ సోమవారం డిమాండ్ చేసింది. పరమేశ్వర వరుస తప్పులకు పాల్పడుతున్నారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు. 2017లో కర్ణాటకలో మహిళలపై దాడుల సందర్భంగా వారిని కించపరిచే విధంగా పరమేశ్వర వ్యాఖ్యలు చేశారని ఆయన గుర్తు చేశారు. యావత్ దేశాన్ని ముఖ్యంగా కర్ణాటకలోని మహిళలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన ఘటనపై రాష్ట్ర హోం మంత్రి చేసిన వ్యాఖ్యలు ఆయన నీచ మనస్తత్వానికి అద్దం పడుతుందని పూనావాలా ఆరోపించారు. నిందితులకు అండగా హోం మంత్రే నిలబడితే కర్ణాటక పోలీసులు ఎలా పనిచేయగలరని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో మహిళలపై నేరాలు 50 శాతం పెరిగాయని ఆయన చెప్పారు. మహా భారతంలో ద్రౌపదికి జరిగిన పరాభవాన్ని కూడా పరమేశ్వర చాలా చిన్న సంఘటనగా కొట్టివేయగలరని, ఆ సంఘటనే పాండవులు, కౌరవులకు మధ్య మహా సంగ్రామానికి దారితీసిందన్న విషయం అందరికీ తెలిసిందేనని బీజేపీ నేత వ్యాఖ్యానించారు. పరమేశ్వర వ్యాఖ్యలు సిగ్గుచేటని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆస్తిలో పిల్లలకు 1% కన్నా తక్కువే ఇస్తా

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్

వాషింగ్టన్ : మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ తన ముగ్గురు పిల్లలకు తన ఆస్తి మొత్తాన్ని వారసత్వంగా ఇవ్వాలని కోరుకోవడం లేదు. 'ఫిగరింగ్ ఔట్ విత్ రాజ్ షమని' పాడ్‌కాస్ట్‌లో ఆయన మాట్లాడుతూ, సంపన్న కుటుంబాలు తమ వారసత్వం గురించి తీసుకునే నిర్ణయాలు వారి సొంత విలువలపై ఆధారపడి ఉంటాయన్నారు. తాను తన పిల్లలను బాగా పెంచానని, మంచి విద్యను అందించానని, అయితే ఆస్తిని మాత్రం తన మొత్తం సంపదలో 1 శాతం కన్నా తక్కువే ఇస్తానని చెప్పారు. ఇది వంశపారంపర్యం కాదన్నారు. మైక్రోసాఫ్ట్‌ను నడపాలని తాను వారిని కోరడం లేదని చెప్పారు. వారు సొంతంగా సంపాదించుకుని, విజయం సాధించే అవకాశాన్ని ఇవ్వాలని అనుకుంటున్నానని తెలిపారు. బిల్ గేట్స్ మాజీ భార్య మెలిందాతో ఆయనకు ముగ్గురు పిల్లలు రోరీ గేట్స్, జెనిఫర్ గేట్స్ నస్సర్, ఫోబే గేట్స్ ఉన్నారు. ఆయన ఆస్తి విలువ 155 బిలియన్ డాలర్లు. దీనిలో ఒక శాతం అంటే, 1.55 బిలియన్ డాలర్లు (సుమారు రూ.13,294 కోట్లు). ఈ ముగ్గురు పిల్లలకు ఈ ఆస్తిని ఇచ్చినట్లయితే, ప్రపంచంలోని ఒక శాతం సంపన్నుల్లో వారు కూడా ఉంటారు.

ఇజ్రాయెల్ నియంత్రణలో 50% గాజా భూభాగం

పాలస్తీనియన్లు తిరిగి రాకుండా ఇండ్లు, సదుపాయాలు ధ్వంసం

టెల్ అవీవ్: గత నెలలో హమాస్‌పై తిరిగి యుద్ధాన్ని ప్రారంభించిన ఇజ్రాయెల్.. గాజాపై మరింత పట్టు సాధించింది. 50 శాతం గాజా ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తీసుకుంది. ఇజ్రాయెల్ సరిహద్దు వెంబడి గాజాలో ఒక పద్ధతి ప్రకారం బఫర్ జోన్‌ను విస్తరిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియా పేర్కొన్నది. పాలస్తీనియన్లు తిరిగి వెనక్కి రాకుండా, ఒకవేళ వచ్చినా..అక్కడ ఉండేందుకు ఎలాంటి ఆవాసం లేకుండా అంతా ధ్వంసం చేస్తున్నారని వార్తలు వెలువడ్డాయి. ఇజ్రాయెల్ సైన్యం, హక్కుల సంఘాలు వెల్లడించిన సమాచారం ప్రకారం, ఇటీవలి కాలంలో గాజా స్ట్రిప్‌లో మిలిటరీ బఫర్ జోన్ రెట్టింపైంది.

విద్యార్థినిపై వారం రోజులు గ్యాంగ్ రేప్!

- వారణాసిలో 22 మందిపై ఎఫ్ఐఆర్
- మోదీ నియోజకవర్గంలో దారుణం

వారణాసి: ప్రధాని మోదీ సొంత నియోజక వర్గంలో మహిళలపై లైంగిక వేధింపులు పెరుగుతున్నాయి. ఇటీవల వారణాసి జిల్లా డిప్యూటీ జైలర్‌ను జైలర్ లైంగికంగా వేధించిన ఘటన వెలుగు చూడగా, తాజాగా ఓ విద్యార్థిని (19)పై జరిగిన గ్యాంగ్ రేప్ కలకలం సృష్టించింది. పన్నెండో తరగతి విద్యార్థినిపై 22 మంది వారం పాటు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. బాలిక ఫిర్యాదు మేరకు ఎఫ్ ఐఆర్ నమోదు చేశామని యూపీలోని వారణాసి పోలీసులు మంగళవారం తెలిపారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని, మిగిలినవారి కోసం గాలిస్తున్నామని వెల్లడించారు. మార్చి 29న ఫ్రెండ్‌ను కలిసేందుకు వెళ్లిన తమ కూతురు అదృశ్యమైందని విద్యార్థిని తల్లిదండ్రులు ఈ నెల 4న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆమెను కిడ్నాప్ చేసినవారు ఈ నెల 4న బాధితురాలికి మత్తు మందు ఇచ్చి, వదిలేశారు. అక్కడి నుంచి ఆమె తన ఫ్రెండ్ ఇంటికి వెళ్లింది. ఆ తర్వాత ఆమెను ఆమె ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం ఆమె తాను ఎదుర్కొన్న దారుణ పరిస్థితుల గురించి తన తండ్రికి తెలిపింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమెపై 22 మంది హుక్కాబార్, హోటల్, లాడ్జి, గెస్ట్ హౌస్ వంటి వేర్వేరు చోట్ల అత్యాచారం చేసినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. పోలీసులు అదే రోజు కేసు నమోదు చేశారు.

డబుల్ ట్రబుల్ ఇంజిన్

కలాం-100 ఇంజిన్ పరీక్ష సక్సెస్

విక్రమ్-1 రాకెట్ ప్రయోగంలో కీలకం: స్కైరూట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: విక్రమ్-1 రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతున్న హైదరాబాద్ స్టార్టప్ కంపెనీ 'స్కైరూట్ ఏరోస్పేస్' కీలకమైన విజయాన్ని సొంతం చేసుకుంది. విక్రమ్-1 రాకెట్ కోసం సిద్ధం చేసిన 'కలాం-100' ఇంజిన్‌ను విజయవంతంగా పరీక్షించింది. తాజా ప్రయోగంలో అధునాతన నాజిల్‌తో కలాం 100 ఇంజిన్ 102 సెకన్లపాటు మండించినట్టు సంస్థ ఓ ప్రకటనలో పేర్కొన్నది. విక్రమ్-1 రాకెట్ ప్రయోగం మూడో స్టేజీని 'కలాం-100' ఇంజిన్‌తో చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఇంజిన్ పనితీరుకు సంబంధించి అత్యంత కీలకమైన 'స్టాటిక్ ఫైర్ టెస్ట్'ను స్కైరూట్ పూర్తిచేసుకుంది. ఆపరేటింగ్ ఏరియాలో గరిష్టంగా 100 కిలో న్యూటాన్ల పీడనాన్ని (శూన్యంలో) ఉత్పత్తి చేసినట్టు తెలిసింది. తద్వారా రాకెట్ ప్రొపల్షన్ సిస్టమ్‌లో స్కైరూట్ తన సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించింది. విక్రమ్ రాకెట్ అభివృద్ధిలో కీలకమైన ఓ మైలురాయిగా ఇది నిలవనున్నది. స్కైరూట్ ఏరోస్పేస్ కంపెనీ మూడు వేరియెంట్లలో విక